

మళ్లీ చెలరేగిన అల్లర్లు

కొవ్వూరు మళ్లీ రావణ కాష్టమైంది.. ఇరువర్గాల దాడులతో అట్టుడికింది.. గురువారం రాత్రి గణేశ విగ్రహ నిమజ్జనోత్సవంలో జరిగిన ఘర్షణ ఇరువర్గాల మధ్య దాడులకు ఉసిగొల్పింది..


8లో



కనకదుర్గమ్మకు బంగారు కిరీటం

గోకవరం దేవీచౌక్ ఆలయంలో కొలువైన శ్రీకనక దుర్గమ్మ వారికి రూ.21 లక్షలతో తయారు చేయించిన బంగారు కిరీటాన్ని దాత కంబాల శ్రీనివాసరావు, భక్తులు అందజేశారు.

1.62 లక్షల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం సాయంత్రం 1,62,276 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 14,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్.వి.రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు.

ఉపాధి అవకాశాలపై దివ్యాంగులకు శిక్షణ

కాకినాడ సిటీ: దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వివిధ అంశాలలో అవసరమైన నైపుణ్య, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి దివ్యాంగుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల సాధికారతకు చేపట్టాల్సిన చర్యలు, సదరం పత్రాల మంజూరు, భవిత సెంటర్లు, దివ్యాంగుల పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, వివిధ అంశాలపై నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాల వంటి అంశాలపై వివిధ శాఖల అధికారులు, దివ్యాంగుల అసోసియేషన్ ప్రతినిధులతో కలెక్టర్ చర్చించారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి బ్యాక్‌లాగ్ పోస్టులకు ఇద్దరికి ఉద్యోగ ఉత్తర్వులను కలెక్టర్ అందజేశారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తే జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక క్రీడా పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధులు శాఖ ఇన్‌చార్జి ఏడీ పి.నారాయణమూర్తి, డీఈఓ పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటలిజెన్స్ డీఎస్పీగా మురళీమోహన్



బాధ్యతలు స్వీకరిస్తున్న మురళీమోహన్

కాకినాడ క్రైం: కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సంయుక్త కాకినాడ యూనిట్ డీఎస్పీగా సుంకర మురళీమోహన్ కాకినాడ వైద్యనగర్ ఇంటలిజెన్స్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. మైలవరం ఏసీపీగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. జిల్లా పరిధిలో ఎస్సై నుంచి డీఎస్పీ స్థాయి వరకు వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది.

డీఐజీ, రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ



డీఐజీ శివరామ్



రిజిస్ట్రార్ ఆనందరావు


కాకినాడ లీగల్: ఈ నెల 18వ తేదీన డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్ బదిలీలు జరిగాయి. అందులో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీఐజీగా బి.శివరామ్, కాకినాడ జిల్లా రిజిస్ట్రార్‌గా కె.ఆనందరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

పిఠాపురం ఎంఈవో సస్పెన్షన్

పిఠాపురం: మండల విద్యాశాఖాధికారి ఆర్‌వీ ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వరదలు, భారీ వర్షాల సమయంలో పాఠశాలలకు సెలవు ప్రకటించాలని జిల్లా కలెక్టరు ఇచ్చిన ఆదేశాలు అమలు చేయకపోవడం, ఇతర విషయాల్లో వచ్చిన ఆరోపణలపై జిల్లా విద్యాశాఖాధికారి విచారణ నిర్వహించి నివేదిక ఇచ్చారు. ఈ మేరకు ఎంఈవోను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆర్జేడీ నాగమణి ధ్రువీకరించారు.

తైల మర్దనం





మార్కెట్‌లో నూనెల ధరలు ఇలా..

వంట నూనె	పాత ధర	కొత్త ధర	కిలోపై తేడా
పామాయిల్	95	114	19
సన్ ఫ్లవర్	113	133	20
సోయాబీన్	108	129	21
వేరుశనగ	200	228	28

- వంట నూనె దిగుమతి సుంకం 20 శాతం పెంపు
- లీటరుపై రూ.25 వరకూ పెరుగుదల
- దానికి తోడు కృత్రిమ కొరత
- అవస్థలు పడుతున్న నగటు జీవి

కాకినాడ సిటీ: ఆంధ్రా ప్రజలకు ఊరగాయో.. రోజువారీ పచ్చడో లేకపోతే ముద్ద దిగదు. తాలింపు మొదలుకొని ఊరగాయ పెట్టేవరకు అన్నింటికీ అవసరమైన నూనెల ధరలు బహిరంగ మార్కెట్‌లో మండిపోతున్నాయి. కొందరి ఇళ్లలో భోజనం చేసేటప్పుడు సైతం చేతి మీదకి చమురు వెయ్యమంటారు. ఇద్దరు పిల్లలతో ఉన్న ఓ చిన్నపాటి కుటుంబానికి వంటకు, టిఫిన్లకు, వారానికోసారి చొప్పున బిర్యానీ చేసుకున్నా నెలకు కనీసం సగటున ఐదు కిలోల నూనె వినియోగం అవుతుంది. నూనె లేకుంటే వంటే పరిపూర్ణం కాదు. అధిక వినియోగంలో ఉండే నిత్యావసరాలపై ధరలు పెంచితేనే ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూరేది. రాజకీయంగా వినియోగించని వస్తువంటూ ప్రభుత్వాలకు ఏదీ లేదని చెప్పాలి. ఎన్నికలయ్యేదాకా ఓ మాట.. ఎన్నికలయ్యాక ఓ మాట అన్నట్టుంది ఎన్‌డీఏ సర్కార్ తీరు. నిత్యావసరాల ధరలు నియంత్రిస్తామని గద్దెనెక్కిన పాలకులు ఆనక అమాంతం దిగుమతి సుంకం పెంచేయడంతో వంట నూనెల ధరలు భారీగా పెరిగిపోయాయి. అన్ని ధరలతో పాటు నూనెల ధరలూ అందలాన ఉండడంతో సగటుజీవి నానా అవస్థలు పడుతున్నాడు. పస్తుండలేడు.. తినకుండా ఉండలేడన్నట్టు తయారైంది అతని పరిస్థితి.

కేంద్రంలోని కూటమి సర్కార్ దిగుమతి సుంకాలను 20 శాతానికి పెంచడంతో ఈ పరిస్థితి నెలకొందని వ్యాపారులు అంటున్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఇప్పటికే గణనీయంగా పెరగడంతో వంటగదిలోకి వెళ్లాలంటే సగటు మహిళలు బెంబేలెత్తిపోతున్నారు. ధరలు భగ్గుమని మండుతున్న ఉల్లి, వెల్లుల్లి జాబితాలోకి తాజాగా వంట నూనె వచ్చి చేరింది. దీంతో నోటికి రుచిగా ఏమైనా చేసుకుని తిందామనుకునే సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఒక్కసారి ఆలోచించాల్సిన దుస్థితి నెలకొంది.

ఎన్నికల హామీని తుంగలో తొక్కి

తాము అధికారంలోకి వస్తే నిత్యావసరాల ధరలు నియంత్రిస్తామంటూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి పార్టీలు తుంగలో తొక్కేసాయి. అధికారం చేపట్టి వంద రోజులైనా ఉల్లి, వెల్లుల్లి ధరలు ఏ మాత్రం తగ్గలేదు. కనీస ధరల నియంత్రణకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. తాజాగా వంట నూనెల దిగుమతిపై సుంకాన్ని కేంద్రం 12.5 నుంచి 32.5 శతానికి పెంచడంతో లీటరుపై రూ.20 నుంచి రూ.25 వరకూ ధరలు పెరిగాయి. ఈ ధరలు మరింత పెరిగే అవకాశముందంటూ కొందరు వ్యాపారులు తమ వద్ద ఉన్న నిల్వలను దాచేసి కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. దీనికి తోడు వంట నూనె కంపెనీల యాజమాన్యాలు మరో అడుగు ముందుకేసి వరుసగా నాలుగైదు రోజుల పాటు సరఫరాను నిలిపివేశాయి. కొన్ని దుకాణాల్లో వంట నూనె లేదని చెబుతుండగా, మరికొన్ని దుకాణదారులు ధరలు పెరుగుదలతో సరుకు సరఫరా కావడం లేదని బుకాయిస్తున్నారు. పాత నిల్వలను అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

ధరలు పెంచేసి.. భారం మోపి..

కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై సుంకాన్ని భారీగా పెంచింది. పామాయిల్, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి వంట నూనెలకు గతంలో బేసిక్ కస్టమ్స్ సుంకాలు ఉండేవి కావు. ప్రస్తుతం వాటిపై కేంద్రం 20 శాతం దిగుమతి సుంకాన్ని విధించింది. దీంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి. జిల్లాలో 6.56 లక్షల కుటుంబాలు ఉండగా ప్రతి నెలా కేవలం వంట నూనె పైనే రూ.11.97 కోట్ల భారం ప్రజలపై పడుతోంది. గతంలో వంట నూనె, కంది పప్పు ధరలు పెరిగినప్పుడు చౌక ధరల దుకాణాల ద్వారా ప్రభుత్వాలు సరఫరా చేసేవి. ఈ నేపథ్యంలో వంట నూనె ధరలు పెరిగిన ప్రస్తుత తరుణంలో చౌక దుకాణాల ద్వారా సబ్సిడీపై అందించాలని కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై చర్యలు తీసుకోవడంతో పాటు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంటున్నారు.

మోయలేని భారం



ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు బాగా పెరిగిపోవడంతో చాలా వరకూ వంటలు తగ్గించాం. నూనెల ధలు కూడా పెంచేశారు. ఇంటికి బంధువులు వస్తే భయపడాల్సి వస్తోంది. ఒక్కసారిగా కేంద్రం ధరలు పెంచి పేదలపై మోయలేని భారాన్ని వేసింది. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలి. వంట నూనెతో పాటు నిత్యావసర సరుకులు, కాయగూరల ధరలు నియంత్రించాలి.

– కర్రి గంగాచలం, తూరంగి, కాకినాడ

ధరలు నియంత్రించాలి



ఓ వైపు వ్యవసాయ ఖర్చులు, కుటుంబ సభ్యుల వైద్యం ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. నిత్యావసర సరుకులు, ఆయిల్ ధరలు పెంచారు. వాటిని కొనుగోలు చేయాలంటే భయమేస్తోంది. దీనికి తోడు స్థానిక వ్యాపారులు కూడా మరో 5 శాతం పెంచి అమ్ముతున్నారు. ఇదేమంటే సరుకు లేదంటున్నారు. ప్రభుత్వం స్పందించి ధరలు నియంత్రించాలి.

– రావుల ప్రసాద్, రైతు, కూరాడ.

23న వికాసలో
జాబ్ మేళా

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన స్థానిక సంస్థ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె లచ్చారావు శుక్రవారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐ అండ్ వి బయో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఎలక్ట్రీషియన్, క్వాలిటీ కంట్రోల్, ప్రొడక్షన్ స్టాఫ్, వరుణ్ మోటార్స్ కంపెనీలో టెక్నీషియన్, సీనియర్ టెక్నీషియన్, ఎగ్జిక్యూటివ్ సేల్స్ అడ్వయిజర్, పెయింటర్ అండ్ డెంటర్, కోజెంట్ అండ్ ఇండో ఎంఐఎం కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, బీఎస్సీ మైక్రోబయాలజీ, బీఎఫ్ఎస్‌సీ ఆక్వాకల్చర్‌లో ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటాయన్నారు. అభ్యర్థులు ఈ నెల 23న ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు.

మున్సిపల్ ఆర్వోగా శ్యామల



సామర్లకోట: కొత్త మున్సిపల్ ఆర్వోగా కె.శ్యామల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్వోగా పని చేసిన పూడి రవిబాబు పదోన్నతిపై శ్రీకాకుళం మున్సిపాలిటీ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఆర్వో పోస్టు ఖాళీగా ఉంది. ప్రభుత్వ జీఓ ప్రకారం ఆయా ప్రదేశాల్లో ఐదేళ్లు పని చేసిన వారి బదిలీల్లో భాగంగా మున్సిపాలిటీలో కొంత మంది అధికారులు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో పిఠాపురంలో పని చేస్తున్న శ్యామల బదిలీపై సామర్లకోట మున్సిపాలిటీకి వచ్చారు. గతంలో ఆమె సామర్లకోట మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా, కొంత కాలం ఆర్వోగా పని చేశారు. అదేవిధంగా ఇప్పటి వరకు మున్సిపల్ మేనేజరుగా పని చేసిన అచ్యుతరాజు తునికి బదిలీ కాగా, ఆయన స్థానంలో మండపేట నుంచి తాతపూడి కనకరాజు మేనేజరుగా బదిలీపై వచ్చి, బాధ్యతలు స్వీకరించారు.

అటవీ ప్రాంతాల్లో ఉమ్మడి తనిఖీలు చేయండి

కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: జిల్లాలో అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న గ్రామాల సరిహద్దులను గుర్తించేందుకు రెవెన్యూ, అటవీ, సర్వే అధికారులు ఉమ్మడి తనిఖీ చేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన జిల్లా అటవీ సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలోని అటవీ సరిహద్దులు గుర్తించేందుకు సర్వే నిర్వహించడం, చెక్ పోస్టుల వద్ద తనిఖీలు, అటవీ జంతువుల అక్రమ రవాణా అరికట్టడం, మడ అడవుల్లో నాటు సారా తయారీ, అక్రమ మద్యం రవాణా నివారణ, అటవీ జంతువులు అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా అటవీశాఖాధికారి ఎస్. భరణి, అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

'పీఎంశ్రీ' ద్వారా మౌలిక వసతులు

ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకం కింద జిల్లాలో ఎంపికైన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

పాఠశాలలను ఆధునిక పరిశోధన కేంద్రాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో ఈ పథకం కింద 31 ప్రభుత్వ పాఠశాలలు ఎంపిక అయ్యాయన్నారు.

స్కానింగ్ సెంటర్లపై నిశితమైన నిఘా

అల్ట్రాసౌండ్ స్కానింగ్ ప్రక్రియను గర్భస్థ పిండలింగ నిర్ధారణ కోసం దుర్వినియోగం కాకుండా స్కానింగ్ సెంటర్లపై నిశితమైన నిఘా, పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కోర్టు హాలులో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ, వెల్లడి నిషేధ చట్టం (పీసీ అండ్ పీఎన్డీటీ యాక్ట్), ఏఆర్టీ అండ్ సరోగసీ యాక్ట్‌ల అమలుపై జిల్లా స్థాయి సలహా, సాధికార కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ చట్టం అమలు ద్వారా సమాజంలో ఆడబిడ్డల పట్ల వివక్ష, భ్రూణ హత్యలు గణనీయంగా తగ్గాయన్నారు. జిల్లాలో గడిచిన ఏప్రిల్ నెల నుంచి సెప్టెంబర్ వరకు 192 తనిఖీలు, 16 రహస్య డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించారన్నారు. వచ్చే అక్టోబరు 11న అంతర్జాతీయ గర్ల్‌చైల్డ్ డే సందర్భంగా సేవ్ గర్ల్ చైల్డ్ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి

జిల్లాలో ద్విచక్ర వాహన చోదకులు, వెనుక సీటుపై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కలెక్టర్ తెలిపారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో సంయుక్తంగా నిర్వహించిన రహదారి భద్రత కమిటీ సమావేశంలో రహదారి ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. నిబంధనలను ఉల్లంఘించే వారి డ్రైవింగ్ లైసెన్స్‌లను సస్పెండ్ చేస్తామన్నారు. ఎస్పీ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలోని నేషనల్, స్టేట్ హైవేలపై దీపాలు లేని జంక్షన్లు, అప్రోచ్ రోడ్ల వద్ద కాషన్ లైట్లు, హైమాస్ట్ లైటింగ్, వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని హైవే అథారిటీ అధికారులను కోరారు.

ఈపీడీసీఎల్‌లో కొత్త సర్కిళ్లు

- ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం
- కాకినాడ, అమలాపురంలో ఏర్పాటు కానున్న కార్యాలయాలు

సాక్షి, రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఈపీడీసీఎల్)లో కొత్త సర్కిళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలుగా ఏర్పడింది. ప్రస్తుతం విద్యుత్ శాఖ తూర్పుగోదావరి జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం సర్కిల్ నుంచి కాకినాడ, కోనసీమ జిల్లాల కార్యకలాపాలు నిర్వహిస్తోంది. జిల్లాలు విభజన అనంతరం కాకినాడ, కోనసీమలకు కొత్త సర్కిళ్లు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ మేరకు ఆ జిల్లాల్లో ఎస్ఈ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. రంపచోడవరం కార్యకలాపాలు మాత్రం తూర్పుగోదావరి జిల్లాలోనే కొనసాగనున్నాయి.

ఉద్యోగుల నియామకంపై కసరత్తు

కొత్త జిల్లాలకు ఏర్పాటైన కొత్త సర్కిళ్లలో అక్టోబర్ నెల నుంచి సర్కిల్ ఎస్ఈ, ఎస్ఏఓల నియామక ప్రక్రియ చేపట్టేందుకు కార్పొరేట్ కార్యాలయం కసరత్తు ప్రారంభించింది. దీంతో ఎస్ఈ పోస్టులకు డిమాండ్ ఏర్పడింది. కాకినాడ, కోనసీమ (అమలాపురం) సర్కిళ్లకు ఎస్ఈలుగా వచ్చేందుకు కార్పొరేట్ కార్యాలయంలోని జనరల్ మేనేజర్ స్థాయి అధికారి, జీఎం క్యాడర్ మహిళా అధికారి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. గతంలో అమలాపురం డీఈగా పనిచేసి ఆక్వా రంగంలో మంచి పట్టు, అనుభవం ఉన్న అధికారిని భీమవరం కొత్త సర్కిల్‌కు ఎస్ఈగా నియమించే అవకాశాలున్నాయి. భీమవరం కొత్త సర్కిల్‌కు సీనియర్ అకౌంట్స్ అధికారిగా విశాఖలోని కార్పొరేట్ కార్యాలయంలో అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగిని నియమించారు.

మళ్లీ ప్రకృతి వైపు..



తుని మండలంలో సేంద్రియ పద్ధతిలో కూరగాయాలు సాగు చేస్తున్న రైతులు

రసాయన ఎరువులు, మందులను పక్కన పెట్టి మళ్లీ వెనుకటి సేంద్రియ సాగువైపు భూమి పుత్రులు దృష్టి సారించారు. నాణ్యమైన, బలవర్ధకమైన పంటలు పండిస్తూ నలుగురికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. తాము సాధించిన విజయాన్ని మరో నలుగురికి పంచుతున్నారు. ఆ నలుగురు మరో నలభైమందికి.. ఇలా నేడు వేల సంఖ్యలో రైతులు సేంద్రియ సాగువైపు మళ్లారు. ఈ మేరకు వ్యవసాయ అధికారులు సైతం ఉత్తమమైన, అధిక దిగుబడులు సాధిస్తున్న రైతుల అనుభవాలను ఆయా ప్రాంతాల్లోని మరికొంతమంది రైతులకు వారి ద్వారానే అవగాహన కల్పిస్తునారు. జిల్లాలో ఇలా 49,897 మంది రైతులు తమ సాగు విధానాలను మార్చుకుని విజయం సాధిస్తున్నారు.

- విస్తరిస్తున్న సేంద్రియ సాగు
- 20 మండలాల్లో 156 పంచాయతీల్లో ముమ్మరంగా చేపట్టిన రైతులు
- ఏటా పెరుగుతున్న సాగుదారులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం అనర్థాలకు దారితీస్తోంది. మట్టిలో సత్తువ తగ్గి, సాగుకు మేలు చేసే సూక్ష్మజీవులు అంతరించిపోతున్నాయి. దీంతో సాగు ఖర్చు నానాటికీ పెరుగుతూ గిట్టుబాటు లభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో తక్కువ వ్యయం అయ్యే ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారిస్తున్నారు. అందుకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ సహజ వ్యవసాయం ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ కృషి ఫలిస్తోంది కూడా. ప్రకృతి వ్యవసాయం జిల్లాలో విస్తరిస్తోంది. భూమాతను సారవంతంగా ఉంచడమే కాకుండా తక్కువ ఖర్చుతో జరిగే ప్రకృతి వ్యవసాయం వైపు జిల్లా రైతులు దృష్టి సారిస్తున్నారు. ఏపీ కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) ప్రాజెక్టు ఆధ్వర్యంలో పూర్వ పద్ధతిలోనే ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. అధికారులు తీసుకున్న చర్యలతో రసాయన ఎరువులు, పురుగు మందుల అవసరం లేకుండా ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ఇప్పుడు రైతులు మక్కువ చూపుతూ బంగారు బాటలు వేసుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు కూడా వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. వినియోగదారులే స్వయంగా పంటలు పండేంచే చోటకు వెళ్లి మరీ ఈ వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసుకుంటున్నారు. కూరగాయాల ధరలు కాస్త ఎక్కువగా ఉన్న సరే వినియోగదారులు వాటిని కొనుగోలు చేస్తున్నారు.

ఏటా పెరుగుతున్న రైతులు

జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లోను ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. కాకినాడ రూరల్, కరప, పిఠాపురం, కాజులూరు, అనపర్తి, సామర్లకోట, పెద్దాపురం, గోకవరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి, తుని, గొల్లప్రోలు, ఏలేశ్వరంతో పాటు పలు మండలాల పరిధిలోని 156 గ్రామాల్లో 49,897 మంది రైతులు 53,253 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.



ఏలేశ్వరం మండలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆకుకూరలు పండిస్తున్న రైతులు

రెండేళ్లుగా మరింత మంది..

జిల్లాలో అధికారులు ప్రతి నెలా 25 నుంచి 30 అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. నెలకు ఒకసారి డివిజన్ స్థాయిలో సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి, గ్రామాల్లో సదస్సులు జరిగినప్పుడు రైతులకు వివరిస్తున్నారు. దీంతో గత రెండేళ్లతో పోల్చుకుంటే 40 శాతం ప్రకృతి వ్యవసాయం పెరిగింది.

విత్తు నుంచి పంట వరకూ

ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అధికారులు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారు. విత్తు వేసే దగ్గర నుంచి పంట చేతికి అందే వరకూ సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ద్రవ, ఘనామృతాలు, చీడపీడల నివారణకు కషాయాల తయారీ వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యక్షంగా చేసి చూపించడంతో పాటు వారితో తయారు చేయిస్తున్నారు. ఎటువంటి ఖర్చు లేకుండా స్థానికంగా దొరికే వాటితో సేంద్రియ ఎరువులు తయారు చేసి, ఉపయోగించి అన్నదాతలు మంచి దిగుబడులు సాధిస్తున్నారు. భవిష్యత్‌లో ఆర్గానిక్ పంటలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉండడంతో రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మక్కువ చూపుతున్నారు.

రెండేళ్ల నుంచి ప్రకృతి సాగు



అధికారుల ప్రోద్బలంతో రెండేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. వరితో పాటు పలు రకాల కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నాను. మంచి దిగుబడి వచ్చింది. చాలా తక్కువ ఖర్చుతో కషాయాలు, ఘన, ద్రవామృతాలు తయారుచేసి వినియోగించాను. గ్రామంలో ఎక్కువ మంది రైతులు నన్ను అనుసరిస్తున్నారు.

– బిక్కిన రాజు, రైతు, బెండపూడి, తొండంగి మండలం

ప్రకృతి సాగువైపు చూస్తున్నారు



పురుగు మందులు, ఎరువుల రేట్లు బాగా పెరగడంతో రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. రైతులు పెట్టుబడి తగ్గించుకునేందుకు ఆలోచిస్తున్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో రైతులు సేంద్రీయ వ్యవసాయం చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం 156 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వచ్చే ఏడాది మరిన్ని గ్రామాల్లో ఈ సాగు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– జె.ఎలియేజర్, ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్

మళ్లీ చెలరేగిన అల్లర్లు..

- కొవ్వూరులో రెండో రోజూ కొనసాగిన దాడులు
- అడుగడుగునా పోలీసు బలగాల మోహరింపు

కొవ్వూరు: కొవ్వూరు మళ్లీ రావణ కాష్టమైంది.. ఇరు వర్గాల దాడులతో అట్టుడుకింది.. గురువారం రాత్రి గణేశ విగ్రహ నిమజ్జనోత్సవంలో జరిగిన ఘర్షణ ఇరువర్గాల మధ్య దాడులకు ఉసిగొల్పింది.. ఈ చిచ్చు మళ్లీ శుక్రవారం రేగింది. ఈ పట్టణంలో రెండో రోజూ ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. ఇక్కడి ఇరువర్గాలకు చెందిన శ్రీరామకాలనీ (తుని పేట), రాజీవ్ కాలనీల్లో అడుగడుగునా పోలీసు బలగాలు మోహరించాయి. ఎక్కడికక్కడే ప్రధాన కూడళ్లలో గస్తీ కాస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం మరోసారి కొట్లాట చోటుచేసుకోవడంతో పోలీసులు పరిస్థితులను అదుపులోకి తీసుకున్నారు. ఒక వర్గానికి చెందిన నలుగురు యువకులు మద్యం దుకాణానికి రావడంతో, మరోవర్గం యువకులు వారిని వెంటాడి దాడి చేశారు. అప్రమత్తమైన పోలీసులు ఇద్దరిని తమ వాహనంలో ఎక్కించుకుని కాపాడారు. మరో యువకుడు పారిపోగా, ఒకరిపై దాడి చేశారు. ఈ విషయం తెలుసుకుని రాజీవ్ కాలనీకి చెందిన కొందరు అల్లరిమూకలు శ్రీరామ కాలనీపై పడి విధ్వంసం సృష్టించాయి. మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పాక్షికంగా ధ్వంసం చేశారు. ఈ ఘటనతో ఇరువర్గాలకు చెందిన వందలాది మంది రోడ్డుపైకి రావడంతో వారిని నియంత్రించడం పోలీసులకు కష్టమైంది. ఈ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రాజీవ్‌కాలనీ వాసులు శ్రీరామ కాలనీ మీదుగా వెళ్లే రహదారిపై ముళ్ల కంచెలు, స్టాపర్లు అడ్డుపెట్టి పోలీసులు పూర్తిగా మూసివేశారు. ఈ మార్గంలో పోలీసు బలగాలు, రెస్క్యూ టీమ్‌లు మోహరించాయి. మరోవైపు ఇరుపక్షాలతో ఆయా కుల సంఘాల నాయకుల ద్వారా శాంతి చర్చలు నడుస్తున్నాయి. జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏవిధమైన అల్లర్లు చెలరేగకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అల్లర్లకు పాల్పడుతున్న వారిని గుర్తించే పనిలో పోలీసు అధికారులు నిమగ్నమయ్యారు. అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్, ఏఆర్ డీఎస్పీ సీవీఆర్‌కే రవికుమార్, సెంట్రల్ డీఎస్పీలతో పాటు కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, రాజమహేంద్రవరం ఏఆర్ బెటాలియన్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.


కొవ్వూరులో ఇరువర్గాల ఘర్షణ వద్ద గుమిగూడిన జనం

ఈ నెలాఖరు వరకూ 144 సెక్షన్

ఈ నెలాఖరు వరకూ శ్రీరామకాలనీ, రాజీవ్ కాలనీల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని డీఎస్పీ జి.దేవకుమార్ ప్రకటించారు. ఇప్పటికే వంద మందికి పైగా పోలీసులు నిరంతరం గస్తీ కాస్తున్నారని అన్నారు. అల్లర్ల నేపథ్యంలో పోలీసు యాక్ట్ 30 సైతం అమలులో ఉందన్నారు. ఇరుపక్షాల ఫిర్యాదులపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. ఒక్కో వర్గంలో వంద మంది చొప్పున రెండు వందల మందిపై కేసు నమోదు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం పట్టణంలో రెండు కులాల మధ్య చోటుచేసుకున్న వివాదంలో వినాయక నిమజ్జనాలు సైతం రాత్రి ఏడు గంటల లోపే ముగించాలని నిర్వాహకులను ఆదేశించామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఇరువర్గాలతో శాంతి చర్చలు

ఇరు పక్షాలు ఒకవర్గంపై మరో వర్గం దాడులకు తెగబడుతున్న నేపథ్యంలో ఈ వివాదాన్ని సర్దుబాటు చేసేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు. సామరస్య పూర్వకమైన వాతావరణంలో వివాదాన్ని పరిష్కరించేందుకు అవకాశం ఇచ్చారు. ఇరుపక్షాల నుంచి ఆరుగురు చొప్పున పెద్దలను పిలిచి మాట్లాడుతున్నారు. గురువారం రాత్రి నుంచి చర్చల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులకు తలనొప్పిలా మారింది. శాంతి చర్చల్లో దాడులకు తెగబడిన ఇరుపక్షాల వారిపై కేసులు నమోదు చేయడం ప్రధాన అజెండాగా చెబుతున్నారు. చర్చలు ఫలిస్తే పరిస్థితి చక్కబడే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉంటే దాడుల నేపథ్యంలో కొవ్వూరు, దొమ్మేరులలో మద్యం దుకాణాలను మూసివేశారు.


రాజీవ్ కాలనీకి వెళ్లే రహదారిని మూసివేసిన పోలీసులు

క్లుప్తంగా

అన్నవరం దేవస్థానం ఈఓ కొనసాగింపు


దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్

అన్నవరం: రాష్ట్ర దేవదాయ, ధర్మదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్‌గా, అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి (ఫుల్ అడిషనల్ చార్జి) ఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న కె.రామచంద్రమోహన్‌ను మరి కొంత కాలం ఈఓగా కొనసాగిస్తూ రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. నూతన ఈఓను నియమించే వరకూ ఆయన ఈ బాధ్యతలు నిర్వహిస్తారని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. గత ఏడాది నవంబర్ 19న ఆయన ఇన్‌చార్జి ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. వచ్చే నెల మూడో తేదీ నుంచి దసరా, నవంబర్ రెండో తేదీ నుంచి కార్తిక మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో దేవస్థానంలో అందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంది. దీనికోసం ఆయనను కొనసాగిస్తూ ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది. కాగా, ఈఓ రామచంద్రమోహన్ 'సాక్షి'తో మాట్లాడుతూ వచ్చే వారంలో సత్యదేవుని ఆలయ శిఖరం బంగారు తాపడం పనులు, కార్తిక మాసం ఏర్పాట్లపై అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు.

అంతర్ జిల్లాల దొంగ అరెస్ట్

ఐ.పోలవరం: పలు జిల్లాల్లో మోటారు సైకిళ్ల దొంగతనానికి పాల్పడుతున్న నిందితుడిని ఐ.పోలవరం పోలీసులు అరెస్టు చేశారు. భీమవరం జిల్లా మోగల్తూరు మండలం శేరుపాలెం గ్రామానికి చెందిన రంగిశెట్టి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని, అతని నుంచి 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఐ.పోలవరం ఎస్సై కె.భానుప్రసాద్ శుక్రవారం తెలిపారు. ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, నరసాపురం తదితర ప్రాంతాల్లో శ్రీనివాస్ ద్విచక్ర వాహనాలను దొంగిలించాడు. ఈ వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి ముమ్మిడివరం కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ పడిందని ఎస్సై తెలిపారు.

డ్వాక్రా అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్‌కు జైలు

కాకినాడ లీగల్: డ్వాక్రా గ్రూపుల సొమ్ము సొంతానికి తీసుకున్న కేసులో అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఏపీఎం)కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ కాకినాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.లీలాశ్యామ్ సుందరి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. పెదపూడి మండల డ్వాక్రా అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా బొద్దాని రాధా అపర్ణ పనిచేసేది. ఆ సమయంలో డ్వాక్రా యానిమేటర్లను వేధించి గ్రూపుల్లో ఉన్న సొమ్ము రూ.12,74,500ను సొంతానికి వాడుకుంది. దీనిపై 2015లో డ్వాక్రా యానిమేటర్లు పెదపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో రాధాఅపర్ణ నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు చెప్పారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య


చెల్లు వెంకన్న (ఫైల్)

అంబాజీపేట: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. ముక్కామల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెనుక ప్రాంతానికి చెందిన చెల్లు వెంకన్న (56) తన ఇంటి సమీపంలోని తాటాకు పాకలో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఇక్కడ సరిగ్గా పనులు లేకపోవడంతో రెండు వారాల కిందట హైదరాబాద్‌లో తన కుమార్తెల ఇంటికి వెళ్లాడు. అనంతరం వారం కిందట తిరిగి ఇంటికి వచ్చాడు. అప్పులు బాధలు ఎక్కువ కావడంతో సమీప బంధువుకు తన స్థలాన్ని రూ.7.01 లక్షలకు విక్రయించాడు. దీనికి అడ్వాన్స్‌గా రూ.1.50 లక్షలను వెంకన్న తీసుకున్నాడు. ఈ నెల 19వ తేదీ రాత్రి ఇంటి బయట నిద్రిస్తానని అతని భార్య నాగమణికి చెప్పాడు. ఉదయం లేచి చూసేసరికి వెంకన్న పాకలో ఉరి వేసుకుని ఉన్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పుల బాధ వల్లే మృతిచెంది ఉంటాడని అంటున్నారు. మృతునికి భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. మృతుని అన్న కుమారుడు చెల్లు వెంకట దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్సై చెప్పారు.

విస్ఫోట క్షతగాత్రురాలి మృతి

- ఏడుగురికి కొనసాగుతున్న చికిత్స
- నిలకడగా వారి ఆరోగ్యం


గొవ్వాల నాగలక్ష్మి (ఫైల్)

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం రావులచెరువు ప్రాంతంలో బాణసంచా విస్ఫోటం ఘటనలో గాయాలపాలై స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గొవ్వాల నాగలక్ష్మి (56) శుక్రవారం ఉదయం మృతి చెందింది. విస్ఫోటంలో ఇల్లు తునాతునకలైంది. ఈ ఘటనలో ఇంటి యజమాని గొవ్వాల నాగేశ్వరరావు భార్య నాగలక్ష్మి కూడా తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. తలకు తీవ్రగాయం కావడంతో ఆమెకు న్యూరాలజిస్ట్‌లు శస్త్రచికిత్స చేసి ప్రత్యేక వైద్యం అందిస్తున్నా ఘటన జరిగిన ఐదు రోజులకు మృత్యువాత పడింది. ఈ ప్రమాదంలో మొత్తం 14 మంది గాయపడగా అందులో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన ఆరుగురు స్వల్పంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొంది ఘటన జరిగిన గత సోమవారమే ఇంటికి వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన ఎనిమిది మంది స్థానిక కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇంటి యజమాని గొవ్వాల నాగేశ్వరరావుతో పాటు ఆ ఇంటి కుటుంబీకులు మొత్తం గాయపడ్డారు. ఇప్పుడు భార్య నాగలక్ష్మి మృతి చెందగా మిగిలిన ఏడుగురికి వైద్యం కొనసాగుతోంది. వారి ఆరోగ్యం బాగానే ఉందని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. నాగలక్ష్మి మృతి చెందిన వార్త తెలియగానే వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ నాయకులు స్థానిక కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి ఆమె కుటుంబీకులు, బంధువులను ఓదార్చారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ కూడా నాగలక్ష్మి కుటుంబీకులను పరామర్శించారు.


నాగలక్ష్మి బంధువులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

పడి లేచిన పొగాకు ధర

- లోగ్రేడ్ రకానికీ మంచి రోజులు
- రైతుల మోములో ఆనందం
- కిలోకు రూ.120 పెరుగుదల

దేవరపల్లి: లోగ్రేడు పొగాకు ధర మార్కెట్లో క్రమేపీ పెరుగుతోంది. మొన్నటి వరకూ కిలో రూ. 120 పలకడంతో రైతులు ఢీలా పడ్డారు. ఏప్రిల్, మే నెలల్లో లోగ్రేడు పొగాకు ధర రూ. 270 నుంచి రూ.305 పలకడంతో అప్పట్లో అమ్ముకున్న రైతులకు మంచి ఆదాయం వచ్చింది. తర్వాత దీని కొనుగోలుకు ట్రేడర్లు ముందుకు రాకపోవడంతో కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేశారు. బ్రైట్ పొగాకు అమ్మకాలు పూర్తి కావడంతో గత రెండు వారాలుగా మీడియం, లోగ్రేడు పొగాకు కొనుగోళ్లు ప్రారంభించారు. అయితే లోగ్రేడు పొగాకు కొనుగోలుకు ట్రేడర్లు ఆసక్తి చూపకపోవడంతో ధర పతనమైంది. కిలో ధర రూ. 150 పలకడంతో రైతులు రెండు రోజులు వేలాన్ని అడ్డుకుని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జరిగిన వేలంలో కిలో రూ. 150 నుంచి రూ.120 పలికింది. చేసేదిలేక రైతులు వచ్చినకాడికే చాలు అనుకుని కిలో రూ. 120కు విక్రయించారు. ఒకటి రెండు కంపెనీలు మాత్రమే లోగ్రేడు పొగాకు కొనుగోలు చేయడంతో పోటీ లేక ధర పతనమైంది. బుధవారంతో దేవరపల్లి వేలం కేంద్రంలో పొగాకు అమ్మకాలు ముగిశాయి. గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలలోని వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు జరుగుతున్నాయి. అక్కడ లోగ్రేడు పొగాకుకు రెండు రోజుల నుంచి డిమాండ్ పెరిగింది. జీపీఐ కంపెనీకి లోగ్రేడు పొగాకుకు ఎగుమతి ఆర్డర్లు రావడంతో కొనుగోలుకు దూకుడు పెంచారు. వీరితో పాటు ఐటీసీ సంస్థ కూడా కొనుగోలుకు ముందుకు రావడంతో మార్కెట్లో పోటీ ఏర్పడింది. దీంతో మార్కెట్లో కిలో లోగ్రేడు ధర రూ. 240 పలుకుతుంది. ఈ ధర మరింత పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. ముందుగా అమ్ముకున్న దేవరపల్లి వేలం కేంద్రం పరిధిలోని రైతులు కిలోకు రూ. 100 నుంచి 120 నష్టపోయామని వాపోతున్నారు.

నేటితో గోపాలపురంలో ముగింపు

గోపాలపురం వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు శనివారంతో ముగుస్తాయని పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు బేళ్ల అమ్మకానికి 952 రాగా, 847 బేళ్లు కొనుగోలు చేశారన్నారు. మిగిలిన బేళ్లు శనివారం కొనుగోలు చేస్తారని, దీంతో 2023-24 ఏడాదిలో పండించి పొగాకు కొనుగోళ్లు ముగుస్తాయని ఆయన తెలిపారు. కిలో బ్రైట్ గ్రేడు గరిష్ఠ ధర రూ. 410 పలుకుతుందన్నారు. ఈ నెల 25 నాటికి ఎన్‌ఎల్‌ఎస్ పొగా కు విక్రయాలు ముగుస్తాయని ఆయన తెలిపారు.

టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం


శ్రీప్రకాష్‌లో టీటీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం: విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే సీబీఎస్‌ఈ క్లస్టర్ స్థాయి ఏడో టేబుల్ టెన్నిస్ 2024-25 పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. స్కూల్ డైరెక్టర్ సీహెచ్ విజయ్ ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యేతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు మాట్లాడారు. విద్యార్థులు క్రీడల పట్ల శ్రద్ధ కనబరిచేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. ఏపీ టీటీ అసోసియేషన్ కార్యదర్శి పి.విశ్వనాథ్, స్కూల్ డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ అండర్-14, 17, 19 బాలుర, బాలికల విభాగ పోటీల్లో సుమారు 350 మంది క్రీడాకారులు తలపడతారన్నారు. బాల్ బ్యాడ్మింటన్‌లో 11 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో గెలుపొందిన రాజమహేంద్రవరానికి చెందిన కుమిలి రాంబాబును అతిథులు సత్కరించారు.

దాడి కేసులో మూడేళ్ల జైలు

తుని రూరల్: తుని మండలం వి.కొత్తూరులోని కేజీబీవీలో అధ్యాపకురాలు ముక్కుడుపల్లి మధురాక్షిపై ఆమె భర్త రాజేశ్వరరావు కత్తితో దాడి చేయడంతో నిందితుడికి పిఠాపురం అసిస్టెంట్ సివిల్ జడ్జి ఎం.బాబు మూడేళ్లు జైలు శిక్ష, రూ.మూడు వేల జరిమానా విధించినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి శుక్రవారం తెలిపారు. 2020 సెప్టెంబర్ 16న బాధితురాలి సోదరుడు సీహెచ్ నాగవెంకట సత్యశివ ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి ఎస్సై వై.గణేష్ కేసు నమోదు చేశారు. రూ.50 లక్షలు అదనపు కట్నం ఇవ్వాలని డిమాండ్ చేసినా ఇవ్వకపోవడంతో తన సోదరి మధురాక్షిపై విచక్షణ రహితంగా దాడికి పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి ఆధారాలు కోర్టుకు సమర్పించడంతో జడ్జి తీర్పు ఇచ్చారని ఎస్సై తెలిపారు.

సెంట్రల్ జైలు ఖైదీ మృతి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఖైదీ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. జైలు అధికారుల వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా బలుసులపాడు మండలం వసంతవాడకు చెందిన సంగం శ్రీనివాసరావు (47) తన తల్లిని హత్య చేసిన కేసులో 2017 జూన్ 24న సెంట్రల్ జైలుకు వచ్చాడు. అతను జైలుకు వచ్చిన నాటి నుంచి షుగర్, గుండె వ్యాధితో బాధపడుతున్నాడు. పరిస్థితి విషమించడంతో జైలు అధికారులు అతనిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ మృతి చెందాడు.


రైలు నుంచి జారిపడి మహిళ మృతి

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ వద్ద పట్టాలపై గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. పట్టాలపై మృతదేహం ఉండటంతో రైల్వే ఎస్ఎస్ బి.కిశోర్ సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం సాయంత్రం సంఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. రైలు నుంచి జారిపడి మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతురాలి వయసు సుమారు 65 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని పెద్దాపురం ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి ఎస్సై బి.లోవరాజు తెలిపారు.

సబ్జెక్ట్ టీచర్ల నియామకానికి దరఖాస్తులు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్టు టీచర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయాధికారి జి.వెంకటరావు శుక్రవారం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి బాలుర గురుకులంలో ఇంగ్లిషు పోస్టు 1, మ్యాథ్స్ 1 పోస్టులకు పురుషులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అదే విధంగా బాలిక గురుకులంలో ఇంగ్లిష్-2, జువాలజీ 1, ఫిజికల్ సైన్స్ 1 పోస్టులకు మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తులు అందించాలన్నారు. వీరిని గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన భర్తీ చేస్తారన్నారు. గతంలో గురుకులాల్లో పని చేసిన వారికి ఏడాదికి ఒక మార్కు, గరిష్టంగా ఐదు మార్కులు కలుపుతారన్నారు. ఆసక్తిగల పురుష, మహిళా అభ్యర్థుల నుంచి వారి బయోడేటాతో పాటు ధ్రువపత్రాల నకళ్లను ఈ నెల 24వ తేదీ లోపు జిల్లా కోఆర్డినేటర్ ఆఫీసు, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ, కలెక్టరేట్ కాంపౌండ్, వికాస ఆఫీస్ పైన, కాకినాడ అనే చిరునామాలో అందజేయాలన్నారు. విద్యార్హతలకు సంబంధించిన సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఎడ్ మరియు టెట్‌ల్లో అర్హత పొంది ఉండాలని సమన్వయాధికారి వెంకటరావు తెలిపారు.

కనకదుర్గమ్మకు బంగారు కిరీటం సమర్పణ


బంగారు కిరీటం

గోకవరం: గోకవరంలో ప్రసిద్ధి గాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువైన శ్రీకనకదుర్గమ్మ వారికి రూ.21 లక్షలతో తయారు చేయించిన బంగారు కిరీటాన్ని దాత కంబాల శ్రీనివాసరావు, భక్తులు అందజేశారు. గతేడాది శరన్నవరాత్ర ఉత్సవాల్లో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అమ్మవారికి బంగారు కిరీటాన్ని చేయిస్తానని సంకల్పించారు. సుమారు రూ.21 లక్షలతో రత్నాలతో పొదిగిన బంగారు కిరీటాన్ని చేయించడానికి సంకల్పించి భక్తులను సైతం భాగస్వాములను చేయడానికి పిలుపునిచ్చారు. ఆయన పిలుపు మేరకు భక్తులు సుమారు రూ.7 లక్షలు విరాళాలు అందించగా, మిగిలిన రూ.14 లక్షలు సమకూర్చి కిరీటాన్ని తయారు చేయించారు. శుక్రవారం సర్వాంగ సుందరంగా తయారు చేసిన నవరత్నాల బంగారు కిరీటాన్ని కంబాల శ్రీనివాసరావు ఆలయ అర్చకులకు, అమ్మవారి సేవకులకు, గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి స్వర్ణ కిరీటాన్ని మండలంలో అన్ని గ్రామాల్లో ఊరేగించి ఈ ఏడాది శరన్నవరాత్ర ఉత్సవాల్లో అమ్మవారికి అలంకరిస్తామన్నారు. అలాగే రూ.15 లక్షలతో అమ్మవారి రథం కూడా తయారు చేయిస్తున్నామని, త్వరలో సిద్ధమవుతుందన్నారు. కార్యక్రమంలో దాసరి తమ్మన్నదొర, రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, వరసాల ప్రసాద్, ఇనకోటి బాపన్నదొర, డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, ఆలయ సేవకుడు ఇనకోటి పెద్దులు, ఆచంట రాజు పాల్గొన్నారు.


అమ్మవారి సేవకులకు కిరీటాన్ని అందజేస్తున్న కంబాల శ్రీనివాసరావు

వేధింపుల నుంచి కాపాడండి

- స్వదేశానికి రప్పించాలని బాధితురాలి వేడుకోలు


సారథి దేవీ హేమలత

రాయవరం: జీవనోపాధి నిమిత్తం ఖతర్ వెళ్లిన ఓ మహిళ అక్కడ తనకు జరుగుతున్న బాధలను సోషల్ మీడియా వేదికగా వెల్లడించి, ఇండియా తీసుకువెళ్లాలని వేడుకుంది. తనను రక్షించి తన పిల్లల వద్దకు చేర్చాలని, ప్రభుత్వం తన పట్ల దయ చూపించాలని ఆ వీడియోలో కోరింది. దానికి సంబంధించిన వీడియోలో ఆ మహిళ ఆవేదన ఈ విధంగా ఉంది. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండల కేంద్రమైన రాయవరం గ్రామానికి చెందిన సారథి దేవీ హేమలత స్థానికంగా ఫ్యాన్సీ షాపులో పనిచేసేది. కుటుంబ పోషణ నిమిత్తం భర్త మధుబాబు, ఇద్దరు ఆడ పిల్లలను వదిలి జీవనోపాధి కోసం ఖతర్ వెళ్లింది. 2023 నవంబర్‌లో ఏజెంటు ద్వారా ఖతరు వెళ్లిన ఆమె.. అక్కడ పరిస్థితులు మరోలా ఉన్నాయని ఆ వీడియోలో వెల్లడిస్తూ ఆవేదన చెందింది. భారత కరెన్సీలో రూ.25,000 జీతంతో ఇంటిలో క్లీనింగ్ పని అని చెప్పి తనను ఖతర్ పంపించారని పేర్కొంది. తీరా అక్కడకు వెళ్లిన తరువాత రాత్రి అనక, పగలనక తనతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని, ఆరోగ్యం బాగుండకపోయినా తనతో పనిచేయిస్తున్నారని చెప్పింది. ఆరోగ్యం బాగుండకపోతే ఆస్పత్రికి కూడా తీసుకువెళ్లడం లేదని, కనీసం మందులు ఇవ్వడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేసింది. తాను బతికే పరిస్థితి లేదంటూ ఆవేదనతో వెల్లడించింది. మంత్రులు నారా లోకేష్, వాసంశెట్టి సుభాష్ తనపై దయతలచి తనను స్వదేశానికి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వీడియో ద్వారా వేడుకొంది.

ఇసుక, మట్టి సీజ్

తాళ్లరేవు: అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 8 ట్రాక్టర్లతో సమానమైన మట్టితో పాటు ఆరు టన్నుల ఇసుకను శుక్రవారం సీజ్ చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ సూరిబాబు తెలిపారు. ఆయన కథనం మేరకు.. పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఆ ప్రాంతాన్ని పరిశీలించి మట్టిని సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన మట్టి 8 ట్రాక్టర్లకు పైగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా యానాం- ఆంధ్రా సరిహద్దు ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా ఇసుకను తరలిస్తుండగా కోరంగి పోలీసులు దాడి చేసి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు స్థానిక వీఆర్వో సుబ్రహ్మణ్యం ఇసుకను సీజ్ చేశారు. కాగా సీజ్ చేసిన ఇసుకను దారి మళ్లించి, దాని స్థానంలో బొండు ఇసుకను ఉంచారని పలువురు ఆరోపిస్తున్నారు. దీనికి సంబంధించి బాధ్యులైన ఐదుగురిపై కేసు నమోదు చేశామని సూరిబాబు తెలిపారు.

లైంగిక దాడి కేసులో 25 ఏళ్ల జైలు

కాకినాడ లీగల్: ఆరేళ్ల బాలికపై లైంగిక దాడి చేసిన వ్యక్తికి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.11వేల జరిమానా విధిస్తూ కాకినాడ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె.శ్రీదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం అల్లూరి సీతారామరాజు జిల్లా, రాజవొమ్మంగి మండలం యెర్రంపాడు గ్రామానికి చెందిన గునూరు వరహాలబాబు 2020 అక్టోబర్ 14 తేదీన అదే ప్రాంతంలో ఆరేళ్ల బాలిక మంచంపై నిద్రిస్తుండగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులు చూడగా అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో రాజవొమ్మంగి పోలీసులకు బాలిక తల్లి తమ్మధాల గంగాభవాని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టు విచారణలో నిందితుడు వరహాలబాబుపై నేరం రుజువు కావడంతో పోక్సో చట్టం ప్రకారం 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా, మరో సెక్షన్ ప్రకారం 6నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బాలికకు రూ.7లక్షల నష్టపరిహారం అందజేయాలని తీర్పులో పేర్కొన్నారు. రెండు సెక్షన్లకు ఏకకాలంలో జైలు శిక్ష అమలు జరపాలని తీర్పులో పేర్కొన్నారు. ఏపీపీ పితాని శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.